ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 24.02.2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ సొరంగం పై కప్పు కూలిన ఘటనలో చిక్కుకున్న 8 మందిని రక్షించేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.
2. అమెరికా అతి పెద్ద బయో టెక్నాలజీ సంస్థ ఆమ్జెన్ ఇన్నోవేషన్ సైట్ ను హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు ప్రారంభించారు.
3. స్పౌజ్ బదిలీలకు సంబంధించిన 317 జీవో అంశం కేంద్ర పరిధిలో ఉందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
4. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణంలో అవకతవకల విచారణ కోసం ఏర్పాటు చేసిన న్యాయ కమిషన్ ఈ రోజు నుంచి మలి దశ విచారణ చేపట్టనుంది.

-------------------

**SLBC**

నాగర్ కర్నూల్ జిల్లాలో శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ సొరంగం నిర్మాణ పనుల్లో పై కప్పు కూలిన ఘటనలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మందిని కాపాడేందుకు NDRF, SDRF, సైన్యం,

సింగరేణి, నౌకాదళం, హైడ్రా బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. సొరంగంలో కూలిన మట్టి, బురదను తొలగించడంలో సహాయక బృందాలు నిమగ్నమయ్యాయి. కార్మికులను రక్షించేందుకు అన్ని విధాల ప్రయత్నించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిరంతరం నీటిని బయటకు తోడేయటంతో పాటు సొరంగంలోనికి ఆక్సిజన్ అందించే ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సొరంగంలో కూలిన మట్టి దిబ్బలను తొలగించి ప్రమాదం జరిగిన చోటుకు చేరుకునే ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఎస్ఎల్‌బీసీ టన్నెల్లో జరుగుతున్న సహాయక చర్యలను పరిశీలిస్తున్నారు.

**పీటీసీ, నాగర్ కర్నూల్**

-------------------

**SLBC ADD**

ఇదిలా ఉండగా లోకో ట్రైన్ రాకపోకలకు సొరంగంలో 9వ కిలోమీటర్ వద్ద అంతరాయం ఏర్పడింది. మరమ్మత్తులు చేసి సమస్యను పరిష్కరించేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. సొరంగంలో 11వ కిలోమీటర్ నుంచి రెండు కిలోమీటర్ల మేర భారీగా నీరు నిలిచిపోయింది. దీంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. ప్రత్యేకంగా మోటార్లు తెప్పించి నీటిని బయటకు పంపింగ్ చేస్తున్నారు.

**DESK**

------------------

**ఆమ్జెన్**

అమెరికా అతి పెద్ద బయో టెక్నాలజీ కంపెనీ ఆమ్జెన్ హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను ఈ రోజు ప్రారంభించింది. హైటెక్ సిటీ సమీపంలో ని అమ్జెన్ కార్యాలయ ప్రాంగణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అమ్జెన్ ఇన్నోవేషన్ సైట్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమ్జెన్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాబర్ట్ ఎ. బ్రాడ్‌వే, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్, అమ్జెన్ ఇండియా ప్రతినిధి సోమ్ చటోపాధ్యాయ, అమ్జెన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ గుల్లపల్లి ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కార్యకలాపాల విస్తరణలో భాగంగా రాష్ట్రంలో ఆమ్జెన్ సంస్థ దాదాపు రూ.1600 కోట్ల రూపాయల పెట్టుబడి పెడుతుంది. రానున్న కాలంలో మరిన్ని పెట్టుబడులకు ప్రణాళిక చేస్తోంది. బయో ఫార్మా రంగంలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది.

**పీఎస్**

-------------------

**కేఆర్ఎంబీ సమావేశం**

కృష్ణా జలాల తరలింపు అంశంపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు - KRMB సమావేశం కానుంది. ఈ సమావేశానికి KRMB ఛైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షత వహిస్తారు. కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా తరలిస్తోందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కొన్ని రోజుల క్రితం KRMBకి

ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాల నీటి పారుదల శాఖల అధికారులు హాజరు కానున్నారు. గత వారమే ఈ సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఆంధ్రప్రదేశ్ జలవనరుల కార్యదర్శి విజ్ఞప్తి మేరకు ఈ రోజుకి వాయిదా వేశారు. ఈ సమావేశంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నీటి వాటాలతో పాటు సాగర్ కుడి కాల్వ నుంచి నీటి విడుదల, నీటి తరలింపు అంశంలో తెలంగాణ ఇచ్చిన ఫిర్యాదుపై చర్చించనున్నారు.

**PTC – Hyd, Desk**

-------------------

**బయో ఆసియా సదస్సు**

జీవశాస్త్రంలో సరికొత్త ఆలోచనలు, తాజా ఆవిష్కరణలకు సంబంధించిన బయో ఆసియా – 2025 సదస్సు రేపు హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. 'మార్పు సాధిద్దాం.. ఆరోగ్య సంరక్షణలో హద్దులు చెరిపేద్దాం' ఇతివృత్తంతో ఈ సదస్సును రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో AI ఆధారిత ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్‌లో ఆవిష్కరణలు, ఆరోగ్యం, ఔషధ రంగాల్లో పురోగతులపై ప్రధాన దృష్టి సారిస్తారు. బయో ఆసియా సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష గోయల్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, క్వీన్స్ లాండ్ గవర్నర్ డాక్టర్ జీనెట్ యంగ్ పాల్గొంటారు. ఈ సదస్సులో 50 దేశాలకు చెందిన 3 వేల మంది ప్రతినిధులు హాజరు కానున్నారు.

డెస్క్

----------------------

**పీఎం కిసాస్ యోజన**

పీఎం కిసాన్ పథకం కింద 19వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు బీహార్ లోని భాగల్పూర్ లో విడుదల చేస్తారు. దేశ వ్యాప్తంగా 9 కోట్ల 70 లక్షల మందికి పైగా రైతులు 21 వేల 500 కోట్ల రూపాయల సహాయాన్ని ప్రత్యక్ష నగదు బదిలీ కింద అందుకోనున్నారు. ఈ పథకం ప్రారంభించి ఈ రోజుతో ఆరేళ్లు పూర్తయిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న 731 కృషి విజ్ఞాన కేంద్రాల్లో కిసాన్ సమ్మాన్ సమారోహ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

**NSD**

-------------------------

**ఎమ్మెల్సీ ఎన్నికలు**

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గానికి, అదే స్థానంలో పట్టభద్ర నియోజకవర్గానికి, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజక వర్గానికి గురువారం ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయా జిల్లాల కలెక్టర్లు అవసరమైన ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు, సీసీ కెమెరాలు,

వెబ్ కాస్టింగ్ తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నిబంధనలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

ఇదిలా ఉండగా.. బరిలో నిలిచిన అభ్యర్థులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ఆ పార్టీలకు చెందిన కీలక నాయకులు ప్రచారంలో పాల్గొంటున్నారు. ముఖ్యమత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు నిజామాబాద్, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న పట్టభద్రుల నియోజక వర్గ అభ్యర్థి నరేందర్ రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించనున్నారు.

**డెస్క్**

------------------------

**శాసనమండలి ఎన్నికలు**

మెదక్ నిజామాబాదు, ఆదిలాబాద్ కరీంనగర్ పట్టభద్రుల శాసన మండలి స్థానం కోసం పోస్టల్ ఓటింగ్ కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన ఫెలిసిటేషన్ సెంటర్‌లో కొనసాగుతుంది. పోస్టల్ ఓటింగ్ నోడల్ ఆఫీసర్ శ్రీధర్ మా ఆకాశవాణి తో ప్రత్యేకంగా మాట్లాడుతూ

**------------------సౌండ్ బైట్---------------**

**పిటిసి, కరీంనగర్**

---------------------------

**జీవో 317**

స్పౌజ్ బదిలీలకు సంబంధించిన 317 జీవో అంశంపై రాజకీయాలు చేయడం సరికాదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి  పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 317 జీవో పై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాజకీయం చేయడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.  స్థానికత అంశం కేంద్రం పరిధిలో ఉందని, ఈ అంశంలో ఉద్యోగులు, నిరుద్యోగులు ఆందోళన చెందవద్దని సూచించారు. తాము ఉద్యోగుల సమస్యల  పరిష్కారించేందుక కట్టుబడి ఉన్నామని మంత్రి పేర్కొన్నారు.  317 జీవో సమస్య పరిష్కారం చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చామని తెలిపారు.

**పీటీసీ, హైదరాబాద్**

---------------------------

**బేటీ బచావో**

మహిళల రక్షణ, ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని, దీని కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆసిఫాబాద్ జిల్లా మహిళ సాధికారిత కేంద్రం  కోఆర్డినేటర్ బి.శారద తెలిపారు. బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో ఆకాశవాణి ప్రతినిధితో మాట్లాడుతూ..

**----------------సౌండ్ బైట్--------------**

**ఆసిఫాబాద్ జిల్లా పిటిసి**

------------------------

**కాళేశ్వరం కమిషన్ విచారణ**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ పనుల్లో అవకతవకల విచారణ కోసం ఏర్పాటు చేసిన న్యాయ కమిషన్ ఈరోజు నుంచి మలి దశ బహిరంగ విచారణ చేపట్టనుంది. జస్టిస్ పీసీఘోస్ నేతృత్వంలోని ఈ కమిషన్ గత కొన్ని నెలలుగా విచారణ కొనసాగిస్తూ వాంగ్మూలాలను నమోదు చేస్తోంది. ఈ విడతలో గత ప్రభుత్వంలో పనిచేసిన ఐఏఎస్, మాజీ ఈఎన్సీలతో సహా పలువురు కీలక వ్యక్తులను విచారణకు పిలిచే అవకాశం ఉంది. మరోవైపు  బ్యారేజీ నిర్మాణ లోపాలపై అధ్యయనం చేసిన జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ NDSA తుది నివేదికను ఈ విచారణలో కమిషన్‌కు అందించే అవకాశాలున్నాయి. తుది నివేదికను తమకు అందించాలని పీసీ ఘోష్ కమిషన్ గత నెలలోనే NDSAను ఆదేశించింది.

**డెస్క్**

----------------------